# స్వయంవరం

కుమారి. పి.లీల



అలనాడు—

దమయంతీదేవి కంగారు చెప్పనలవి కాకుండా ఉంది....

అద్దం ముందు నిలబడి నానాహైరానా పడి పోతున్నది.....

బ్యూటీ స్పాట్ చెక్కిలి మీదుండడం నచ్చ లేదామెకు. చెయ్యి చాచేసరికి పరిచారిక అందిచ్చిన దువ్వెనను నేలను విసరికొట్టి, కోపంగా తనేపోయి, పందిరిమంచం మీద గిరవాటేసిన మొఖమల్ టవెల్‌తో ఆ బ్యూటీస్పాట్‌ను చెరిపేసి గడ్డం క్రిందగా పెట్టుకుంది.

ఈలోగా మరో పరిచారిక వచ్చి నలమహారాజా రాకను తెలిపింది. ఉలిక్కిపడి మేలి ముసుగు సవ రించుకుని పరిచారికలు వెంటరా బయల్దేరింది!!

ఆనాటి స్వయంవరంలో దేవతలనే వరించ మని చెప్పడానికని వారి దూతగా వచ్చాడాయన!! నలుడికి తెలుసు, దమయంతి తన్నే వరిస్తుందని!! ఆయనకు తెలుసునని దమయంతికీ తెలుసు!! మరి మధ్యలో ఇదేమిటీ? ఒకవేళ ఆయనకు ఇష్టం లేదేమో తనంటే? మదిలో లీలగా మెదిలిన భావం, స్ఫుటమై గండ్రగొడ్డలిలా కనిపించేసరికి, సిగ్గును వదిలేసి భయాన్ని పట్టుకుంది దమ యంతి!!

"ఈనాటి స్వయంవరంలో నేనెన్నుకొనేది

తమరినేనని తెలిసిఉండీ — మీరు ఈవిధంగా దేవదూతగా వచ్చేసిన కారణం చెబుతారా?" ఈ కాసిని మాటలు అనేలోగా ఆమె అడుగు పెదవిని కంగారు నాలుగైదు సార్లు కొరికేసింది!!

ఉక్కిరి బిక్కిరయ్యాడు నలుడు. లోపల ఉన్న అతని సంతోషం కళ్లల్లోంచీ, పెదవుల మధ్యనుంచీ బయటికి వచ్చి దమయంతిని చూస్తున్నది.

"అవును. నేను దూతను మాత్రమే... వారికి మన విషయం తెలిసే ప్రత్యేకంగా పన్నంపారు. అయినా, ఎంతమందో రాజులు ఈవిధంగానే వారి వారిసామంతులచేత కబురంపి ఉంటారు. దేవతలు కాబట్టి మహారాజునైన నన్నంపారు వారిదూతగా. ఇక మీ ఇష్టం సుమా!" చిరునవ్వు మెరుస్తున్నది అతని మొహంలో.

సిగ్గను ఇందాక వదిలేసిన దమయంతి ఇప్పుడు ఓక్షణంలో సిగ్గుతో సతమతమైపోయింది....

"వెళ్తున్నా. చివరి మాటగా తమ అభీష్టాన్ని మాత్రం నెరవేర్చుకోండి. కావలసిన వారి నెన్నుకునేందుకేగా ఈ స్వయంవరం?"— చిన్నగా నవ్వి వెళ్లతానంటున్నట్లు లేచాడు నలచక్రవర్తి. కాస్సేపు కూర్చోమని అనాలని ఉందామెకు...కానీ, సిగ్గు మధ్యలో "సరే"నని తల ఊపేసింది!! సిగ్గుల తెరతో మేలిముసుగులోంచి మెరుస్తూంటే నల చక్రవర్తి తనివిదీరాచూసి, ఈ సంపద తనదేనని మురిసి సెలవు తీసుకొని వెళ్లిపోయాడు........

మళ్లీ ఒక్క ఉరకలో అద్దాన్ని సమీపించింది దమయంతి! నవ్వింది సీడ నిలువునా!! పునుగూ, జవ్వాజీ మరింత అలముకొంది!!! వాడిపోయాయనుకొని పువ్వులను మార్చేసింది!!!! నలిగిపోయిందనుకొని కాకపోయినా— నలమహారాజు ఈ చీరను చూసేశాడు కాబట్టి చీరను మార్చేసింది! వెనకటి మేలిముసుగు గిరాటువేసి జిలతారు ముసుగు ధరించింది!! తేలి తల తేలినట్లనిపించిందామెకు. ఆభరణాలన్నిటినీ మార్చేసింది!!! పరిచారికలు వెంటరా తను వెళ్లాలి.... చేతిలో ఏమీ లేకపోతే ఎలా? పమిట కొంగుని ఇలా పట్టుకోవాలా? మేలిముసుగు చివరలు ఇలా వేలికి చుట్టుకోవాలా??— అద్దంలో చూసుకుంది! నడకనుకూడాచూసుకుంటున్నది అద్దంలో. నవ్వును ఏవిధంగా నవ్వాలో అద్దంలో చూసుకునే బయల్దేరింది పమిటకొంగునూ, మేలి ముసుగు చివరనూముడివేస్తూ, తీస్తూ.....

సభ నలంకరించిన రాజులందరిలో అసలైన నలుడిమీదే పడింది దృష్టి అనుకోకుండా. ఆమె పెదవులు నవ్వినట్లు అతని కనుకొనలు కనుక్కున్నాయి. ఒక్కొక్క మహారాజు దగ్గరే నిలుచుంటే పరిచారికలు పరిచయం చేస్తున్నారు.... ఒకచోట నలచక్రవర్తిని పరిచయం చేసేటప్పటికి ఉలిక్కిపడింది, మధురమైన ఊహల దొంతర్ల మధ్యలో దమయంతి — "ఆయనను ఆ దిక్కునేగా తను ఇందాక చూస్తే?" అని!! తలెత్తి మొహంలోకి చూసింది. తనింతకు ముందు చూసిన వైపు చూసింది. ఇతను కళ్ళు రెప్పలార్చడం లేదు. అవును, మరి దేవతలు అనిమిషులు.... ఇతనికాళ్ళు నేలకు ఆన్చడంలేదు. అవును, సంపన్నులు కదా దేవతలు.... "నలుని దేవదూతగా పంపింది చాలక అతని వేషంకూడా వేసుకున్నారన్నమాట..." ముందుకు జరిగిపోయిందామె.....

తెల్లబోయింది పరిచారిక. గుసగుసలు బోయారు సభికులు. మళ్లీ ఇంకొక నలుని చూస్తూ "వీరు... వీరు" నట్టుకుంటున్న పరిచారిక. తల వంచుకుని కాళ్లనూ, మేలిముసుగు తెరలోంచి కళ్లనూ చూసి ముందుకు నడిచేసింది దమయంతి.

ఆవిధంగా నలుగు రైదుగురు తటస్థపడ్డారు. చిరాకువేసింది దమయంతికి! ఎంత మంది ఈ వేషంలో ఉంట? చకచకా నడుచుకుంటూ అసలు నలుడిని సమీపించి పరిచారిక చేతి పళ్లెంలోని దండ నందుకుని అతని మెళ్లో వేసేసింది. ఈర్ష్యల మధ్య కరతాళధ్వనులు చెలరేగాయి. దేవతలామె పాతివ్రత్య మహిమను మెచ్చుకుని నాలుగు వరాలు ఆయాచితంగా ఇచ్చి వెళ్లిపొయ్యారుట.....

ఈనాడు —

> ## గమనిక
>
> *ఉద్యోగాలలో ఉన్న స్త్రీలు, ముఖ్యంగా అవివాహితలు ఎదుర్కొనే సమస్యలు అనేకం. స్త్రీలు మాత్రమే అవగతం చేసుకొన గలిగినవి అవి. సానుభూతితో నలిపిన ఒకానొక పరిశీలన ఫలితమే 'స్వయంవరం'.*
>
> ——ఎడిటర్

ఫినిషింగ్ టచెస్ పూర్తిచేసుకుని హేండ్ బాగ్‌లో అద్దమూ, దువ్వెనా, పౌడరూ, కాటికా, పెదవుల రంగూ సర్దేసుకుని డ్రెస్సింగ్ టేబుల్ ముందునుంచి లేచి నిలబడింది విశాలాక్షి.

గుమ్మం నుంచి అడుగు బయటకు కదల్చగానే ఆమెనుచూసి ట్రాఫిక్ కంట్రోలు పోలీసుకే మతి దప్పింది!! నవ్వుకుంది సగర్వంగా లోలోన విశాలాక్షి.

ఆమెకు సిటీ బస్సులో సీటు వేగంగా దొరికింది! మళ్లీ పెదవుంమీద చిరునవ్వు గర్వంగా మెదిలింది!!! ఆమెను కండక్టరు టికెట్టు అడగనూ లేదు. అడిగితేనే నవ్వి ఊరుకునే విశాలాక్షి అడగకపోతే ఇస్తుందా? తనవంతు రాగానే దిగిపోయింది.

ఒకచేత్తో చిరకుచ్చిళ్లను వయ్యారంగా పట్టుకుని, మేడమెట్లు ఎక్కుతూన్న విశాలాక్షి వెనక ముందులుగా చాలామందినే ఆకర్షించింది!! ఆమె ఏగినంత మేరా గాలులకు సువాసనలు అందుతున్నాయి....

ఆమెకు కొంచెం వెనకగా మెట్లెక్కుతూన్న శివరాం ఎవరెస్టు నధిరోహిస్తున్నంత ధీమాగా ఎక్కుతున్నాడు. అతని అదృష్టానికి కొన్ని మొహాలు ముడుచుకొనిపోయిన మాట మాత్రం వాస్తవం....

ఆమె వాసనలను ఆఘ్రాణిస్తున్నట్లు ముక్కును గమ్మత్తుగా చిట్లిస్తూన్న శివరాం అనుకోకుండా వెనుదిరిగిన విశాలాక్షిని చూసి ఉక్కిరిబిక్కిరైపోయాడు. కిలకిలా నవ్వేసింది అతని తంగారుకు విశాలాక్షి. ఆకాశంలో విహరిస్తున్న దేవతల కాలి అందెల రవళిలా ఉంది ఆ నవ్వు. ఆ నవ్వు వింటూనే, దిక్కులు చూచారు తెలుగు తెలిసిన వాళ్ళు, దేవతలు కనిపిస్తారేమోనని. తెలుగు తెలియని వాళ్ళు, కొంచెంగా ప్రత్యక్ష శాస్త్రం (జూలజీ) చదువుకున్న వాళ్ళు ఆ గొంతుకలో ఏముందో ఆపరేషన్‌చేసి చూడాలనుకున్నారు. సెక్షనులో క్లర్కులూ, హెడ్డులూ తలలెత్తి విశాలాక్షి వస్తూందంటూ కళ్లతో చెప్పుకున్నారు ఒకరికొకరు. వెనకగా నడిచే శివరాం మెల్లకళ్ళు ఒక్క నిమిషం మెల్లతప్పి సరిగ్గా నిలిచాయి, మరు నిమిషంలో మెల్ల మెల్లి మెల్లిగా వచ్చేసినా...

ఒకసారిదిరిగా తలవంచుకుని ఆలోచించింది మంజుల, సతిమందిలోనూ అంత కిలకిలా నవ్వ గలుగుతున్న ఆమె మనస్సులో ఏముందో అని. డైమండ్ ఆకారంలో వెనక ఓపెనింగ్ నుంచి జాకెట్టు బయటికి కనిపిస్తూ నిండుగా నవ్వుతున్నది ఆమె శరీరం జున్నుముక్కలా. జర్మ ముడిలో ఇరుక్కున్న తల పిన్నుల్లోని ముత్యాలు కులికాయి తలత్రిప్పుకు. తలలో పువ్వులు తన ఆధిక్యానికి మురిసిపోయి మరింత వాసనలను వెదజల్లాయి గాల్లోకి. పిన్నుతో నొక్కిపెట్టడం వలన కాబోలు గజన్నర పొడుగు పైటకొంగూ అరచేయి వెడల్పులో మడతలు పడి బుద్ధిమంతురాలైన అమ్మాయిలా కనిపించింది....

"నలు చదరమూ, దీర్ఘచతురస్రమూ కాకపోయినా ఎత్తుకు సరిపడా లావు..." మెల్లి కళ్లతో ఆమె ఆకారాన్ని అత్యంత శ్రమతో చూస్తూ వర్ణించుకున్నాడు శివరాం లోలోన....

"తెల్లగా ఉన్నవాళ్లకి ఇంకా తెల్లగా కనబడాలన్న తాపత్రయం కాకపోతే, ఈవిడికి సెంటు పౌడర్లు కోటాదేనికి—?" పైనుంచి చూస్తూన్న రామారావు ప్రక్కనే మైమరచిన గోపాలంతో అంటున్నాడు!

"లిప్‌స్టిక్ రంగూ, నుదుటి కుంకం రంగూ ఒకటే"— కలర్ బ్లైండ్‌నెస్ క్షణం వశించిన గోపాలం కామెంటు జేశాడు....

హరివిల్లులా కత్తిరించిన కనుబొమలనూ, నుదుటిని చిట్లించి 'ప్చ్' అంది విశాలాక్షి సెక్షను గడియారానికీ, తన వాచీకీగల తేడాను గుర్తించి. ఆకాస్త శబ్దానికీ, దానికోసమే ఎదురుచూచే అందరి తలలూ ఒకే దిక్కుగా తిరిగాయి. అన్ని జతల కళ్ళూ ఒకే ఆకారాన్ని చూస్తున్నాయి. కొన్ని తలలు ఆ ఆకారపు ఆకర్షణకు తట్టుకోలేక వంగిపోతే, మరికొన్ని లోలోపల చీత్కరించుకుని వంగిపోయాయి.

## అమ్మకమునకు

"హెూ" న్యూస్ పేపర్ రోటరీ ప్రింటింగ్ ప్రెస్. 24 పేజీల కెపాసిటీ, జంట ఫోల్డర్లు కలది. స్టీరియో ఎక్విప్‌మెంట్ తోసహా సంపూర్ణమైనది; షీట్ కట్ ఆఫ్ 24 అంగుళములు. ఇతర వివరములకు దిగువ అడ్రసుకు వ్రాయండి.

**The Manager, Indian Express, Sassoon Dock, Colaba, Bombay-5.**





హలో! ఒక్క నిమిషం!

మీకు కథలంటే మాకున్నంత సరదా వుందా? మాకు తెలుసు–మీకు కథలు ఓపట్టాన నచ్చవని–మీకు నచ్చే మీరు మెచ్చే కథలు కల్పించి మీచేత ఔననిపించుకోవాలని సంకల్పించి మేమో పత్రిక ఆరంభిస్తున్నాం. గొప్పవాళ్ళనిపించుకున్న వాళ్ళ కొత్త కథలు, సరికొత్త వాళ్ళలో దాగివున్న గొప్ప గొప్ప కథలు చదవాలంటే ఈ పత్రిక చూడండి.

పేరు జ్యోతి – వూరిపేరు విజయవాడ-2

హలో! అరనిమిషం – ట్రెయిన్‌లో గొడవ దేనికి? ట్రైనా వాడెందుకు ఉంటాడు? భూమికి స్తంభాల్లు మతలబు ఏమిటి? పంచదార రూపాయి ఖరీదెందుకయింది? ఇదంతా జరుగుతున్న కథ. జరగని కథల కన్న 'జరిగిన కథ' కథ ఎంతో బాగుంటుందని మీకూ తెలుసు. ప్రపంచంలో దేశంలో, రాష్ట్రంలో, మీ వూళ్ళో, మా ఆఫీసులో జరుగుతున్న కథలన్నిటినీ సమన్వయించి నెలనెలకూ ఒక బృహత్కథ వడ్డిస్తాం–

పత్రిక పేరు జ్యోతి – పేట లబ్బీపేట. వూరు విజయవాడ.

హలో! ఇంకొక్క నిమిషం– అక్కినేని నాగేశ్వరరావుకి జిలేబీలు ఇష్టమో లేదో, ఆయన రుచులేమిటో మాకు తెలీదుగాని, అభిరుచులు, అనేక విషయాల మీద అభిప్రాయాలు మాకు తెలుసు. అమెరికాలో సరికొత్త బాక్సాఫీస్ హిట్ గురించిన విశేషాలు, ఇటలీలో తీసిన కొత్త చిత్రం కథ, ఇవాళే మాకు అందాయి. మొన్న సెట్టుమీద సావిత్రి చక్కని విట్టు చెప్పినప్పుడు మేం అక్కడున్నాం. సుశీల, శ్రీనివాస్ మధురంగా పాడుతుండగా వూగిన తలలలో మా ప్రతినిధిది కూడా వుంది – మా పత్రిక పేరు జ్యోతి – వూరేమో విజయవాడ.

రోడ్డుమీద బస్సుకోసం నిలుచున్నారా? అలా ఎండలోకి చూడకండి. కళ్ళు పచ్చబారతాయి – జేబులో జ్యోతి లోకి చూడండి. ఒక్క నిమిషంలో చదివేవి, అరనిమిషంలో చదివి ఆనందించేవి– చలోక్తులు–హాసక్రీడలు, కార్టూన్లు, చిత్రరథుని చైత్ర...

(సారీ–చోటు అయిపోవచ్చింది. ముందు మా పేర్లు చెప్పి...... ఈ మాసపత్రికకి మానేజింగ్ ఎడిటర్ వి.వి. రాఘవయ్య–సంపాదకుడు నండూరి రామమోహనరావు. ఆ వెనక జనాభా ముళ్ళపూడి వెంకట రమణ, బాపు, వి.ఎ.కె. రంగారావు, రావి కొండలరావు వగైరాలున్నారు) ...యాత్ర, చదరంగం, జీవితం (ఏ.వి.యం బాపతు కాదు) క్రీడ, అద్భుతమైన ఫొటోలు బాపురే భాచిత్రాలు, రేఖాచిత్రాలూ... సారీ మన్నించాలి–చోటుయిపోయింది–మన పత్రికలో కలుసుకుం.


# స్వయంవరం

చిన్నతనంలో చదివిన దమయంతీ స్వయంవరం కథ గుర్తుకువచ్చి గంభీరంగా తలను వంచుకుంది ఒక్కమంజుల మాత్రమే.

అందరి దృష్టులూ ఆకర్షించింది చాలక విసవిసా నడిచి టేబుల్‌మీద హేండ్‌బేగ్‌ను వినురుగా పడేసి పెద్ద శబ్దం అయ్యేలా కుర్చీ లాక్కుని కూలబడింది వాణీ ఒళ్ళుమును సరిజేసుకొంటూ. బయట ఇందాకటినుండీ కాపలా కాసిన రామారావు, గోపాలం వగైరాలు సీట్లకు అతుక్కున్నారు వచ్చి.

ధన, ఋణ ధ్రువాలు ఫిలమెంటు లేకుండా అతుక్కుంటే పెద్ద ప్రమాదం. రెండింటినీ కలిపే ఫిలమెంటు కాంతిని తెస్తుంది. పెళ్లిపెద్దలు అనే ఫిలమెంటు లేకపోతే ఈ ఆఫీసులో ధన ఋణ ధ్రువాలు ఎప్పుడో స్వతంత్రంగా కాంతిని తెచ్చుకుందామని ప్రమాదాన్ని తెచ్చుకునేవి.

మాటల్లో చమిచ్చే విశాలాక్షి చవకబారు తనానికి ముందు మురిసి వెనకగా విమర్శించుకుంటాయి ఆ ఆఫీసులోని తలలు. ఆఫీసులో సమయానికి కదలిక అనేది ఇప్పుడు వచ్చింది. ఆ కాలానికున్న విలువ ఇప్పుడు తెలిసింది అన్న మాట. చేతిలో ఫైళ్ళు చకచకా తిరిగి పోతున్నాయి. టేబుల్‌మీద కాగితాలు త్వరత్వరగా తరిగిపోతున్నాయి. ఆఫీసరు టేబుల్‌మీద గంట నిమిషానికి ముప్పయిసార్లు అరుస్తున్నది వెంట వెంటనే. కాలాన్ని కదిలేది ఆ ఆఫీసులో విశాలాక్షి ఒక్కతే.

ఆమె సెలవు పెట్టిందంటే 'కీ' లేక గడియారం ఆగిపోయినట్లు ఎక్కడి ఫైళ్లక్కడే ఉండిపోతాయి. అర్జంటూ, ఇమ్మీడియట్లూ అంటే అర్థం కంచుకాగడా వేసినా కనిపించదు. ఆమె వస్తే నెల రోజుల తర్వాత కావలసినది "వెరీ అర్జంటుట!"—అంత మోస్ట్ ఇమ్మీడియట్‌గా జరిగిపోతుంది.

ప్రశాంతంగా, నిండుగా, గంభీరంగా ఉండే సరోజ ఎప్పుడు వచ్చిందీ ఆజ తెలియక ఆలస్యమైనందుకు తిడదామనుకున్న సూపర్నెంటు ఇద్దరిని పిలిచి వాళ్ళ ఆమె ఎప్పుడువచ్చిందీ చెప్పలేకపోయినందుకు విసుక్కున్నాడు. అదే సరోజలోని అందం. మనిషి ఎదుటనున్నట్లే తెలియనివ్వని ప్రవర్తన ఆమెది. శబ్దంలేని కదలిక ఆమెది. విసుక్కోబోయి అసలు ఆమె ఎంత ఆలస్యంగా వచ్చిందో తెలియక మరోదోవ వెతకబోయింది సూపర్నెంటు మనస్సు. అవును, మరి... అందవిదాన్ని చూస్తుంటే బాధగానే ఉంటుంది. అందేది ఎంత విలువైనదైనా విలువలేనిది అయిపోతుంది.

"సీతయ్యా...మంచినీళ్ళు పట్రా." విశాలాక్షి కోకిలగొంతు పురివిప్పిన నెమలిలా నాట్యం

చేసింది, ఆ సెక్షను నాలుగు గోడల మధ్య... అసలు విషయం మరిచిపోయింది సూపర్నెంటు మనస్సు. ఆలోచిస్తున్న విషయం ఆమడ దూరంలోకి జరిగిపోయింది గోపాలానికి. వ్రాస్తున్న వాక్యం పాములా ఒకే లైనులో పది మెలికలు తిరిగిపోయింది శివరాంకు. మెదులుతూన్న భావాలు ఒక్కసారిగా వజ్రలాంటి బుర్రలోకి పాపాముల్లా దూరిపోయి బొరియలుమాత్రం మిగిల్చాయి కవికుమారుడు కామేశానికి. ఒక నిమిషం తలయెత్తి, తిడుతూ వ్రాద్దామనుకున్న ఫైలుమీద పొగుడుతూ వ్రాసేశాడు ఆఫీసరు.....నవ్వుకుంది సరోజ మనస్సు మౌనంగా.

మళ్లీ అనుకుంది మంజుల "ఆమె మానసిక ప్రవృత్తులేమిటో..." అని!! కంగారులో గాజు గ్లాసును యమసదనానికి పంపించేశాడు సీతయ్య.

అదీ విశాలాక్షి సమక్షంలో కాలానికున్న విలువ!

• • •

"అరుణా...త్వరగా రావాలి... మంచి వార్త."

"ఆఫీసునుంచి వస్తూనే మొదలు. నేనక్కడికీ ఎన్నిసార్లు చెప్పేను మీకు? నేను చదువుకునే రోజుల్లో కనీసం పరుగు పోటీల్లో అయినా నేను ఏనాడూ పాల్గొనలేదని?" లోపలనుంచి దండకం వినిపిస్తున్నది, అరుణాదేవి అరుణారుణ అధరాల నుంచి.

"అరూ..."

చరచరా ముందు గదిలోకి వచ్చి—"అదిగో... అదే నే వద్దంట! నీరజను నీరూ అని, పార్వతిని పారూ అని, అరుణని అరూ అని ఏమిటా తోక తెగిన పిలుపులు? అరుణా అని పిలిస్తేగానీ పలకను!"

నవ్వుతూన్న శర్మ కెంపుపెదవులు అరుణ పెదవులను మరి పలకనీయలేదు. "అరూ—అంటే ఎంత త్వరగా జవాబిస్తావని?" ముద్దు పెట్టుకున్న పెదవులు ముద్దు ముద్దుగా మాట్లాడుతున్నాయి.

పెదవులను విసురుగా పమిటకొంగుతో తుడుచుకుంటూ—"ఏ—మీరెప్పుడూ ఇంతే అన్నీ ఎంగిలి బుద్ధులు. పెళ్లికంచంలో అన్నం అంతా ఎంగిలిచేత్తో కలిపేయలేదూ? ఊ... ఏమిటా మంచి వార్త?" అన్నది కప్పుపుచ్చుకోబోయినవ్వును పెదాలు దాయనన్నాయి!

నవ్వేసి—చెయ్యి పైకెత్తి—"ఇదిగో...ఇది అందుకో చూస్తా..." అన్నాడు.

తాను పొట్టిగా ఉన్నందుకే అలా అన్నాడని ఊహించి—"మీరు మహా తాళప్రమాణులని అనుకుంటున్నారేమో?" అని ఎత్తిన చెయ్యి చూస్తూ దెబ్బకొట్ట సగంలో ఆపేసింది. పైనున్న చేతిలో కవరు నవ్వింది.

కవరుమీద దస్తూరి మంజులదే అని తెలిసేసరికి కవరులోని కాగితాలు మంజుల కెంపు నవ్వును మరీ వినిపించేశాయి. పంతంమాట మరిచిపోయి చేతులను చాచింది అరుణ.

"దేవి ఇంతగా నామీద కటాక్షం చూపుతూ చేతిలో వాలిపొమ్మంటూ చెయ్యి చాపడం ఇదే మొదలు—"

కెంపుమాటలూ, నెరికన్నుల్లోని చిలిపితనమూ మరెప్పుడైనా ఆస్వాదించాలిగే అరుణ తన చిట్టి చెల్లాయి వ్రాసిన ఉత్తరం చదవాలనే ధ్యాసలో—"అబ్బబ్బ...మీ చేతిలోని ఉత్తరం నా చేతిలో వ్రాలవలసింది..." అంది.

మరికొంచెంసేపు ఏడిపించి, చివరకు కవరు చింపి బిగ్గరగా చదవబోయి, అదురుపాటుగా అరుణ చేతిలోంచి ఉత్తరం లాక్కుపోయేసరికి, ఉత్తుత్తి కోపం వచ్చేసింది శర్మకు.

"నా చేతుల్లో ఉండవలసింది నీవు. పైగా ఉన్న ఉత్తరాన్నికూడా ఊడలాక్కోవడంలోని ఆంతర్యం నా కర్థంగావటంలేదు. కాబట్టి పది నిమిషాలు మౌనం." పది నిమిషాలకు అలారంపెట్టి బుంగమూతితో కోపంగా చతికిలబడ్డాడు సోఫాలో పాపం.

"నాకు మరీ మంచిది మీ మౌనం! ఇది చదవడానికి కనీసం పది నిమిషాలైనా పడుతుంది. హాయిగా ఏ గొడవా ఉండదు. అయినా మరీ విసురుగా చతికిలపడితే విరుగుతాయి." నవ్వుతూ జవాబు చెప్పి, నలిగిపోయిన కాగితాలను సరిచేసి మడతలను విప్పుకుంటూ, "చాలా పెద్దదే—" అనుకుంది ప్రకాశంగా.

"దస్తావేజా నయం—" మౌనం మరిచిపోయి అనేసి, మధ్యలో జ్ఞాపకానికి రాగా నాలిక కొరుక్కున్న శర్మ ఇదేమీ గమనించని అరుణను చూసి నవ్వుకున్నాడు.

"మహాలక్ష్మి సమానురాలైన అక్కయ్యకు,

చెల్లాయి నమస్కారములు.

నేను డబ్బును ద్వేషిస్తాననే విషయం నీ ఎరికలోనిదే కాబట్టి నేను నిన్నిప్పుడు ఒక మహాలక్ష్మితో పోలుస్తున్నందులకు మరోలా అనుకోకు.

పెద్దవాళ్లకీ, ముత్తయిదువులకీ ఉత్తరాలు వ్రాసేటప్పుడు ఒక మహాలక్ష్మితో సరిసమానంగా భావిస్తున్నట్లు వ్రాయడం, నమస్కారార్పించడం పరిపాటయిపోయింది. అదే అలవాటులో నీకూ వ్రాసేశాను.

అయినా, అక్కయ్యా, బ్రహ్మ సరస్వతికి నాలుకనీ, పరమేశ్వరుడు పార్వతికి అర్ధదేహాన్నీ ఇచ్చినట్లే, విష్ణుమూర్తి పెళ్లానికి వక్షఃస్థలాన్నాలవాలం చేశాడు. పైగా లక్ష్మీదేవి పాతివ్రత్యం గూర్చిన బొమ్మలు చూస్తూనే ఉన్నావుగా? ఎప్పుడూ ఆదిశేషుని తల్పంమీద పవ్వళించిన శ్రీ మన్మహావిష్ణువు అరికాళ్లకి కొబ్బరి నూనెమర్దనా చేస్తూనే ఉంటుంది...

కాబట్టే, ఆమె పాతివ్రత్యం దృష్ట్యా పతికి ఆమెపై గల ప్రేమదృష్ట్యా, ఆమెకి పతిపైగల భక్తి అనురాగాల దృష్ట్యా నిన్ను లక్ష్మీదేవితో పోల్చడానికి నా హృదయం ఒప్పుకుంది.

ఇక నమస్కారాలంటావా? చిన్నప్పటి సంగతి నీకు గుర్తుందీ? నేనేదో చిన్న కొంటెపని

## గమనిక

*మామూలుగా ప్రచురణకుకాని, పోటీలకు కాని కథలు, నవలలు ఎవరికవంపాలో తెలియవరచమని కోరుతూ కొందరు వ్రాస్తున్నారు. 'ఎడిటర్, ఆంధ్ర ప్రభ సచిత్ర వారపత్రిక, చిత్తూరు'కు పంపాలి*

*రేఖాచిత్రాలు, డిజైనులు ఇండియన్ ఇంక్‌తో వేసినవి మాత్రమే ప్రచురణకు పరిశీలించడం జరుగుతుంది. మామూలు సిరాతోకాని, పెన్సిల్‌తోకాని వేసినవి అంగీకరించబడవు. ఇండియన్ ఇంక్‌తో వేసినవి కవరులో మడిచి పంపవచ్చు.*

—ఎడిటర్

**SYCO**

సుప్రసిద్ధ వైద్యులు డా॥ తోలేటి వేంకటరాజు గారి రెండు దశాబ్దాల పరిశోధనా ఫలితము సైకోటిక్ (ఫీవర్) తత్వమును నిర్మూలించి

**ఫైలేరియా - ఉబ్బసము**

లను పూర్తిగా నివారించును పదిరోజుల కోర్సు మోతా. 40 రోజులలో పూర్తిగా నివారణ అగును కోర్సు ఒక్కింటికి **SYCO-S** రూ. 4/— **SYCO-C** రూ. 5/—

**For literature send nP. 25.**

**SYCO PRODUCTS, Bhimavaram, W. G. Dist. A.P.**

మా ఖాతాదారులకు

సంక్రాంతి శుభాకాంక్షలు

**క్వాలిటీ**

ఏలూరు రోడ్డు, విజయవాడ—2.

**ఫాన్సీ అండ్ కన్‌ఫెక్షనరీ అండ్ జంగన్ హాల్**

మా వద్ద అన్నివస్తువులు సరసమైన ధరలకు లభించును.

అన్నికరముల **CAD BURY'S** చాక్లెట్లు దొరకును.

**NAVIN.**

## ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

### ఉగాది నవలల పోటీ

# రు 2,500 లు బహుమతులు

శోభకృతు సంవత్సరారంభసమయంలో కూడా నవలల పోటీ నిర్వహించాలని సంకల్పించాము. రచయితలకు, రచయిత్రులకు ఇతోధికమైన ప్రోత్సాహం ఇవ్వడానికి నిశ్చయించాము.

**శోభకృతు ఉగాది నవలల పోటీలో గెలుపొందే నవలలకు ఈ దిగువ పేర్కొన్న విధంగా బహుమతులు ఇవ్వడానికి నిశ్చయించాము:**

**మొదటి బహుమతి రు 1,500 లు**
**రెండవ బహుమతి రు 600 లు**
**మూడవ బహుమతి రు 400 లు**

పోటీలో పాల్గొనేవారు పాటించవలసిన నిబంధనలు ఇవి :

1. రచన 250 అరఠావు కాగితాలకు మించరాదు.
2. సిరాతో, కాగితానికి ఒక ప్రక్కనే వ్రాయాలి.
3. ఇతివృత్తం ఆంధ్రుల జీవితానికి సంబంధించినదై ఉండాలి.
4. సాంఘిక, చారిత్రిక ఇతివృత్తం ఏదైనా ఎన్నుకొనవచ్చు.
5. అముద్రితాలుగాక స్వీయ రచనలు మాత్రమే పోటీకి పంపాలి.
6. బహుమతిపొందని రచనలలో ప్రచురార్హమైనవి ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురించే హక్కు మాకు ఉన్నది.
7. బహుమతి పొందని రచనలను, ప్రచురార్హం కాని రచనలను త్రిప్పి పంపగలము.
8. పోటీకి పంపే రచనలను 'ఎడిటర్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, చిత్తూరు'కు పంపాలి.
9. కవరుమీద 'ఉగాది నవలల పోటీకి' అని స్పష్టంగా వ్రాయాలి.

**ఉగాది నవలల పోటీకి రచనలు మాకు చేరవలసిన ఆఖరితేది**

**1963 జనవరి 31**

*రచయితలు ఈ అవకాశం వినియోగించుకొని, తమ సంపూర్ణ సహాయ సహకారాలు అందజేయాలని అర్థిస్తున్నాము.* —ఎడిటర్


## స్వయంవరం

చేసినందుకు నీవు అమ్మతో చెప్పేస్తానని భయపెడితే, నీకు నేను ఒక పందుమ శతాన్ని అర్పించవలసి వచ్చింది. ఆనాటి ఆలోచనా విధానమే వేరు. అందుకనే పసిపిల్లలు అంత నిర్విచారంగా ఉండగలుగుతారు. ప్రపంచంలోని కుళ్ళూ, కళ్మలమూ వాళ్ళకి తెలియనే తెలియవు. మంచి చెడుల వివక్షత తెలియదు. కత్తికి తేనెపూసి నాకమనే మనుష్యులుంటారనే ఊహైనా కలుగదు వాళ్ళకు.

'అసత్యమాడరాదు' అనే వాక్యం ఒకటో క్లాసు దగ్గరినుండి నేర్పుతారు. ఈ విధంగా అసత్యమాడరాదు, ఆలోచింపక ఏపనియు చేయరాదు అనేవి ఓ న మా లనుంచి పిల్లలకి నేర్పించడం బహుశా పంతుళ్ళకి కూడా అలవాటయిపోయి ఉంటుంది. నా నమస్కారాలూ, సంబోధన పరిపాటిలా.... 'అసత్యమాడరాదు' అనేది నేనదే రోజున పలకమీద పిండీ బలపంతో వ్రాయడంవలన నీవు నామీద దయతలచి, నా విషయం అమ్మతో చెప్పనవేసరికి, నేను నా వాగ్దానాన్ని పురస్కరించుకుని, సూర్య నమస్కారాల్లా నీకు వంద నమస్కారాలు చిన్నతనంలోనే పెట్టాను. ఇహ ఈనాడు పెట్టడంలో అబ్బురం ఏముందీ?

ఒకటో తరగతిలో చెప్పి ఆపైన తిరిగి చెప్పక పోవడంవలన కాబోలు అనుక్షణమూ జ్ఞాపకశక్తి నశిస్తున్న నేటికాలపు పిల్లలు అయిదో తరగతి నుండే గొప్ప గొప్ప అబద్ధాలు ఆడెయ్యగలుగుతున్నారు సుమా....

నేను కొత్త, ఆఫీసులో ఈరోజే చేరాను. చదువుకున్న చదువు సార్థకం కావాలంటే ఉద్యోగం చెయ్యాలనే భావనగల నిన్ను అమ్మా వాళ్ళూ పెద్దమ్మాయివని, నీ బి. ఏ. డిగ్రీని ఒక పెళ్ళి క్వాలిఫికేషనుగా మార్చి, నీకు తగిన వరునికోసం రెండు ఏడుల లోకాలన్నీ వెదకి, బ్రహ్మముడిని అతి ప్రయత్నంమీద కుదిర్చి, బావని వెదకి తీసికొని వచ్చి నీమెళ్ళో మూడు ముళ్ళూ వేయించేశారు. ఆపైన మంచి గృహిణివి కమ్మని దీవించి దుఃఖాన్ని అణుచుకొని చీరసారెలతో పాటుగా నిన్ను అత్తవారింటికి సాగనంపారు. ఇది నీకు ఇష్టంలేని పని, అవునా?

అప్పుడు నువ్వు నాతో ఏమన్నదీ నీకు గుర్తుందీ? 'మంజూ, ఎంత అదృష్టవంతురాలివే నువ్వు! చక్కగా ఉద్యోగంచేసే అవకాశం లభించింది. నన్ను చూడు. అమ్మా నాన్నలకు నా పెళ్ళి తొందరేకానీ, నాకోరిక తీరుద్దామని అనిపించిందీ? మా ఆఫీసులో ఒక పోస్టు ఖాళీగా ఉందన్నావు కదా? పెళ్ళి నిశ్చయమయ్యేలోగా చేస్తుందిలే అనైనా అనుకోలేదు. చదువూ గుణమూ మొదలగుగాగల కలవారి సంబంధం కోసం రెండు ఏడులలోకాల్నీ వెదికి ఆరు నెలల కాలాన్నీ, ఆరువేలనీ వెచ్చించి చివరికిది కుదిర్చి నన్ను పరాయి అమ్మాయిని చేసేశారు!'—అని.

అన్నవాళ్ళకంటే విన్నవాళ్ళకీ, పడ్డవాళ్ళకీ ఎక్కువ గుర్తుంటాయి సహజంగా. కానీ, చమత్కారం చూడు.... అప్పుడు నేనేమన్నానో మాత్రం నాకు గుర్తుంది. 'ప్రాచీన సంప్రదాయానికీ, ఆధునిక నాగరికతకీ మధ్యకాలం నీది. నీవు నలిగిపోక తప్పలేదు'— అని అన్నాను. అయినా ఇందులో నీవు నలిగిందేముందీ? నువ్వు దూరంగా ఉన్నప్పుడు ఇన్ని కబుర్లు చెప్పే నేను, మా అందరి దగ్గరగా వచ్చిన తర్వాత అనుకుంటావా— 'నేను అదృష్టవంతురాలినే సుమా'— అని!

సర్వసాధారణంగా పోల్చి చూస్తేనే కానీ, మంచీ — చెడూ, సుఖమూ — దుఃఖమూ,

అందమూ — అనాకారితనమూ మొదలైనవి కనిపించవు. నీ ప్రస్తుత జీవితంలోని సుఖాలని అణుమాత్రమైనా గ్రహించలేని నాకు అందులోని లోపాలు కాసినీ గోరంతలు కొండంతలుగా కనిపిస్తాయి. చెడును గ్రహించినంత త్వరగా లోకం మంచిని గ్రహించదు.... దుఃఖాన్ని వివరించుకున్నట్లు మంచిని వివరించుకుంటారా మరి? అయినా ఎవరినైతే మన మధికంగా ప్రేమిస్తామో, వారిని అంతకి రెట్టింపు బాధిస్తామని ఎక్కడో చదివిన గుర్తు!!

నిజమేకదూ మరి — నిన్ను అమ్మానాన్నలు ఎంతగానో ప్రేమించారు కాబట్టి ఉద్యోగం చెయ్యాలనే నీ ప్రతిపాదనని త్రోసిరాజని నీకు పెళ్లి చేసెయ్యడమనేదే నిన్ను బాధించినట్లుంది కదూ? నిజం. నిజాలన్నీ కఠిన వజ్రాలుగా ఉండవలసిందిపోయి ఇంతగా— హృదయాన్ని తాకేవిగా ఎందు కనిపిస్తున్నవీ? అందులోనే ఉంది గమ్మత్తు....

అసలు దీనివల్ల జరిగిన మంచి నీకు ముందు ముందు తెలుస్తుందిలే. కొన్ని పనుల పరిణామాలు ఆ తర్వాతే తెలుస్తాయి వాటి పరిమాణము ఎంతెంతైనా.

సరే — ఆ ఆఫీసులో ఇంతకి తక్కువ జీ(వి)తమూనూ, ఎక్కువ పనీనూ... అందుకని, ఈ ఆఫీసులో చేరాను. చిరునామా మార్పు గుర్తు పెట్టుకుంటావు కదూ?

పూర్వం నవాబుల పరిపాలన సాగినదీ, ప్రస్తుత ఆంధ్ర రాజధానీ అయిన ఈ హైదరాబాదు నగరంలోని పోస్టల్ చమత్కారం నీకు తెలియదు. అందుకనే అఫీషియల్ ఉత్తరాలనుకొనబడేవి సవ్యంగా అందుతాయనే ఆశతో నా ఆఫీసు అడ్రసు ఇస్తున్నాను. కానీ, ఒక్కొక్కప్పుడు ఇవీ ఎగిరిపోతుంటాయి. పోస్టుమన్ ఉత్తరాలను సవ్యంగా చేర్చకపోతే పోస్టల్ డిపార్టుమెంటు మీద ఒక ఫిర్యాదు తయారు చెయ్యవచ్చు. ఆఫీసుకుచేరి, మనలను చేరలేని ఉత్తరాలపై మనం వ్రాయబోయే ఫిర్యాదు ఎవరికి అందేలా వ్రాయాలో మనకే తెలియదు!!

నీవు కోరుకునే ఉద్యోగమూ, పై చదువుల్లో ఎన్నెన్ని కష్టాలున్నాయో వ్రాయమంటావా? ఆడపిల్ల చదువుకుందన్నా— ఉద్యోగం చేస్తున్నదన్నా— స్టేజిమీద బల్లగుద్ది ఉపన్యాసాలిచ్చిన మహామహులు సైతం ఆ విషయం ఆచరణలో వినగానే, ఉపన్యాసంలో త్రాగిన కడివెడు మంచి నీళ్ళూ కళ్లద్వారాగానీ, చెమటరూపంలో గానీ కార్చేస్తారు.

నీకంటే నేను వయస్సులో చిన్నదాన్ని. సాంసారిక సుఖాలగూర్చి తెలియనిదాన్ని. కానీ, ఈవిధమైనటువంటి జీవితంలో అనుభవం గడించిన దాన్ననేది కటిక సత్యమనేది నీవూ ఒప్పుకుంటున్నావు కదూ!

ఇది వినగానే అంటావూ— ఇదిగో, ఈసంసారాల్లోని కష్టాలగూర్చి నీకేం తెలుసునూ? అని. సంసార జీవితంలో కష్టాలనేవి అసలు ఉండవని అన(లే)మగానీ, ఈ కష్టాలనేవి భగవంతుడు కొంతమందికే నిర్దేశించాడు.

'మేరేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్' అన్నాడో మహానుభావుడు. నిజంకదూ? వివాహాలు విధి వ్రాతలే! అసలు, నీ సంసారంలో కష్టాలనేవి నీకు తెలుసునా? మా ప్రక్కింటి అమ్మాయిని అత్తగారు పెట్టే కష్టాలూ, ఎదురింటి అమ్మాయిని ఆడపడుచు పెట్టే కష్టాలూ, అవతలింటి అమ్మాయిని మొగుడు పెట్టే కష్టాలూ, మరో అయినింటి పడుచును మామపెట్టే కష్టాలూ, ఉన్నవారి కోడలి అధికబాధలూ—ఇవన్నీ విన్నాకనే కదా— సంసారంలో కష్టాలనేవి కూడా ఉంటా

# సంక్రాంతి రాత్రి

## దాశరథి

ఒంటరిగా
"వింటర్"లో
వెళ్లబోకు భాయీ!
కంటకాలవలె చలి మన
వెంటపడినదోయీ!

మంటలు వేసిన యంతనె
మన చలి పరుగెత్తేనా?
జంటలలో దొరుకు వేడి
మంటలలో లేదోయీ!

ఒంటరితనమే ఒక గో
రంటముల్లులా గుచ్చెను,
గుండెలలో శీతుబాధ
కొంచెముకొంచెము హెచ్చెను.

భోగి మంటలోని జ్వాల
ముగ్ధలాగ తోచునేల?
కౌగిలించుకొన పోగా
కరములనే కాల్చునేల?

చూచుటకే ముగ్ధురాలు
లోలోపల ప్రౌఢురాలు,
చల్లని చూపులతోనే
గిల్లజూచు ప్రియురాలు.

వ్యంగ్యముగా మాటలాడు,
బాధదీర్చ పాటబాడు,
భోగిమంట వేసివచ్చి
పొంగిపోయి ఆటలాడు

ఎంత దగ్గరగ ఉండునో
అంతదవ్వులో మండును
దొరికినట్లె కనిపించును
దొరకదేమొ అనిపించును

నోట నీటి నూరించును
చెంత జేర వారించును
చలిలో చచ్చెడి నాపై
శాలువాళ్లు కప్పించును

అందానికి చంద్రముఖ
చూపులలో సూర్యముఖ
చలికేమో జ్వాలాముఖ
నను వలచిన నా సఖ

కమ్మని సంక్రాంతినాడు
రమ్మని వ్రాసింది నాకు
తీరా వెళ్లేసరికే
తల్లి వెనుక తాను నక్కు

పరమాత్మను చేరలేక
పరితపించు ఆత్మలాగ
చెంతనున్న చిన్నారికి
చేరలేక చింతించితి

విసిగిపోయి ఇంటి వెనుక
విరితీగెల జొంపములో
వేసిన కుర్చీలోనే
మూసినాను కన్నులను.

చల్లని సంక్రాంతి రాత్రి
పెల్లుబికినదెల్ల ధాత్రి.
అంతట చేయొకటి తాకె
వింత వెచ్చదనము ప్రాకె

ఒంటరిగా
వింటర్ లో
వెళ్లబోకు భాయీ!
కంటకాలవలె చలి మన
వెంటపడిన దోయీ! *

# సంక్రాంతి ముత్యాల సరాలు

కుమారి కొసరాజు భారతి

ఆది కాలము నందు తిక్కన
మధ్య కాలము నందు వేమన
నవ్య సాహితి యందు నీవే
వినుతి కెక్కిన వారవహో!

క్రొత్తప్రాతల మేలు కలయిక
క్రొమ్మెఱుంగుల నలరి వెలయగ
కూర్చి నాడవు తెలుగు కైతల
గొప్పతన మిది కాదటే!

ముత్యహారము పేర బరగెడు
నూత్న ఛందోభంగి తెల్పియు
తెలుగు వారలు నిన్ను మెచ్చగ
వెలసి నాడవు జూడగా!

"దేశ మంటే మట్టి కాదని
దేశ మంటే మనుజు"లంచూ
మేటి పాటల చాటి చెప్పియు
'దేశభక్తి'ని చూపితే!

శుభద సందేశమ్ము లందున
సకల జనముల హెచ్చరించియు
దేశ ప్రగతిని కోరి మెలగిన
యుగపురుషుడవు నీవహో!

నీదు 'పూర్ణమ' కథను జదువగ
నీదుమెత్తనిహృదయమగుపడు;
కరడు గట్టిన మానసమ్ముల
కరుణ రసములు పొంగెడిన్!

ఆంధ్ర వాణికి ప్రియము
గూర్చియు
ఆంధ్ర జనముల మేలు కోర్చియు
ఆంధ్ర భూమికి సేవ సల్పిన
ఆంధ్ర పుత్రుడ వీవె పో!

సంఘ సంస్కరణోద్య మమునకు
అడుగు ముందుకు వైచినాడవు
రచన లెన్నో సలిపినాడవు
ప్రాంజలించెద సత్కవీ! ❋

# స్వయంవరం

యని నీవు తెలిసికున్నది!

నా సుఖాలని మహ బాగా చదివేసినట్లు నాకీ ఉపన్యాసం ఏమిటే అని విసుక్కోకు. నీవు స్టేజిమీద నా న్యాసాన్నే చూశావుకానీ ఉపన్యాసాన్ని వినలేదు. అందుకే నీకిది వింతగా తోస్తుంది. స్టేజిమీద 'మధురానగరిలో' చేస్తూ రాధిక వేషంలో ఉన్న నేను, రాధిక పాత్రలో అంతగా లీనమైపోయి భావప్రకటనను 'ఎక్సలెంట్'గానూ, 'మార్వలెస్'గానూ చేసేశాననుకున్నారు ప్రేక్షక లోకం. అసలు కిటుకు ఇప్పుడు చెబుతున్నాను విను.

చిన్నప్పటినుంచీ నా ఊహలోని నా భవిష్యత్తు బాట రాజమార్గమే మరి— డాక్టరేట్లు సంపాదించాలనీ, ఉద్యోగాలుచేసి ఊళ్లేలేయాలనీ ఉండేవి. అందుకే ఒకసారి ప్రయోగంచేసి చూద్దామని ఆనాడు రంగంమీద నాట్య కార్యక్రమంలో నా పేరిచ్చేశాను. మనవైపు— అంతగా నాగరికత వ్యాపించని ప్రదేశాల్లో— డిగ్రీలు పొందినా మనసు అడుగు దూరం కదలని మనుష్యులమధ్య నేను నాట్యం చేస్తానంటే నాన్నా, నీవూ ఒప్పుకోలేదు. అమ్మ నవ్వేసింది— అసలు భయపడ వలసిన ఆవిడ ధైర్యం ఇచ్చింది. అడుగుల కదలిక అవసరం లేకుండా అందుకే భావప్రకటనకి సరిపడే నాట్యం ఎన్నుకున్నాను.

మేం ఏర్పాటుచేసుకున్న రంగానికి, నేనలంకరించుకున్న గదికీ మధ్య ఆనాడు వారధి కట్టరానంత దూరం ఉందనిపించింది. బారెడు పొడుగునా జడా— జడ చివరను గుణగుణలాడుతున్న కుచ్చులూ— ముక్కున ముక్కరా— చెంపసరాలూ, సూర్యచంద్రులూ మేలి మునుగులోంచి మెరుస్తూంటే వయ్యారంగా నెత్తిన కుండ పెట్టుకుని గజ్జెలు ఘల్లు ఘల్లుమంటూంటే పెరుగు అమ్ముకుంటూ ప్రేక్షక లోకం ముందు నిలువలేక రంగస్థలం నలుమూలలా తిరిగాను.

పాదాలమున్న ఘల్లుమనేవి గజ్జెలుగానీ, గుండె గుబగుబలాడి పోతూంది కంగారు భయాలమధ్య. కృష్ణుడు వేషంలోని • స్వర్ణలత వస్తూనే చెయ్యి పట్టుకునేసరికి నిజంగా గుబులుగా ఉందేమో గుండె హడిలిపోయి ఎవరో చెయ్యి పట్టుకున్నారు అనుకుని ఉలిక్కిపడి నాలుగడుగులు వెనక్కి వేసేశాను.

ఆ ఉలికిపాటులో ఎంతో సహజత్వ ముందన్నారు వీరు. కుండ వదిలేస్తూంటే పెరుగు తింటున్నట్లు నటిస్తున్న కృష్ణుడికి అందించేననుకొని ఆ జడువుకు సెభాష్ అన్నారు. ఇక నాకప్పుడు తెలిసింది, నేను స్టేజిమీద ఉన్నాననీ, మంజులనికాను రాధికననీ— కృష్ణుడి వేషంలోది స్వర్ణలతేననీ. ఇక అసలు విషయం గ్రహించి మంచిగా కుండ తీసికొని 'పెరుగు నీకు కాదు. అది నేను అమ్మదలుచుకున్నది సుమా!' అని తెలియజెప్పడంకోసం అడుగులు లయ తప్పకుండా వేస్తూ 'మధురా నగరిలో...' మొదలెట్టాను. నీకు ఎక్కువ వివరంగా చెప్తుతూంటే చిరాకనిపించవచ్చు. అసలు హాలులో కరతాళ ధ్వనులు మిన్నుముట్టిన పదమూ, కృష్ణవేణి సన్నాసమయంలో ఫోటోలో భద్రపరిచిన సంఘటనా— మీరంతా మురిసిపోయిన సన్నివేశమూ—ప్రేక్షకులు మూడు నాలుగుసార్లు రెట్టించి చేయించుకున్నదీ చెబుతా.

పెరుగుకుండని మధ్యలో వదిలేసి—నాతో సరసాలాడుతూ వచ్చే కృష్ణుడిని చూస్తూంటే, అది రాజబాట అనీ, పది మందీ చూస్తారనీ ప్రతిమాలుకుంటూ పైటకొంగును వదిలించుకుంటే, జడను పట్టుకున్న కృష్ణుడి చేతిలోంచి నానా అవస్థపడి లాక్కుంటూ, 'కొసరి కొసరి నాతో సరసములాడకు—రాజమార్గమిది కృష్ణా'—అంటూ ఆ సమయానికి ప్రేక్షకుల్లోంచి ఎన్నో జతల కళ్లు నాతోపాటుగా అనుసరిస్తూ చూస్తూంటే, హడిలిపోయి, 'అమ్మో! వీళ్లందరి మధ్య నేనూ నా భవిష్యత్తు నిర్ణయించుకున్నాను' అని ఊహ రాగానే, కళ్లల్లోంచి భీతీ, కంగారూ ఒకేసారి కనిపించాయి. బుగ్గలు కంగారులో ఎరుపెక్కిపోయాయి.

పాజ్ఞానం నశించి గబుక్కున నేనుని వెనక్కు లాక్కునేసరికి, కృష్ణుడు ఎవరైనా వస్తున్నారేమోననే భయంలో జడ వదిలేశాడు.

మరుక్షణంలో మళ్లీ అది రంగస్థలం అని గుర్తుకువచ్చి మెరుపుతీగలా తప్పించుకుని నెత్తిన కుండని సుతారంగా పట్టుకుని 'మాపటి వేళకి తప్పక వచ్చెద—మధురానగరిలో...' అని నటించే నన్ను చూసి అదంతా నటనలోని భాగమనుకుని, హాలులోని కరతాళధ్వనులు మిన్ను కెగిసిపోయాయి.

ఆనాటి నా న్యాసాన్ని గుర్తుపెట్టుకుని, పేరువలెనే లలిత పదసమూహంలాంటి మంజుల వజ్రాల్లాంటి నిజాలు చెబుతూంటే నీకు విచిత్రంగా తోస్తున్నది. ఆ...నీ సంసారం గురించేగా నా ప్రస్తుత ఉపన్యాసం?

సంక్రాంతికి ఓ రెండు రోజులు బావని విడిచి ముందుగా రావడానికి నీవెంత కొట్టుమిట్టాడినదీ నిన్ను తీసికెళ్లడానికి వచ్చిన నాకు

తెలియదూ? బావమాత్రం నీవు నాలుగు గంటల బండికి నన్ను పంపిస్తానని ముహూర్తం పెట్టి ఆఫీసుకు పోయినట్లే పోయి వాళ్ళ సెక్షనులో పనులు పురమాయించేసి ఇంటికి వచ్చేసింది నిన్నారుగంటలూ విడలేకనేకదా? నిన్ను ఆ ఆరు గంటలూ చూసుకోవాలనేకదా!

మీ దంపతుల మధ్య నేనొకర్తిని! ఆ సంగతి గ్రహించగలిగేను కాబట్టే 'నాకు నిద్ర వస్తోంది — రాత్రి బండిలో నిద్ర రాదు' అనే వంకతో ప్రక్క గదిలోకి పోయి తలుపులు బిడాయించుకున్నది!

'అరుణా! ఎంతటివాళ్ళు మీ ఆడవాళ్ళు! పుట్టిల్లు పేరు చెబితే ఎగిరి గంతేసి వెళ్ళిపోతారు. నువ్వులేని రెండ్రోజులూ నేనెల్లా ఉంటానో నీకక్కర్లేదా?' అని బావ అంటూంటే, బావ మాటలని మధ్యలోనే ఆపి, 'ష్! మంజుల వింటుంది...ఏమిటిది? ఆరు నెలల సహవాసిని వదిలిరావడానికి ఇంత బాధ పడుతున్నావేం? ఆ వచ్చేది ఇరవైయ్యేళ్ళు పెరిగిన ఇంటికి రానదానికేగా అంటూ వెక్కిరిస్తుంది మంజుల'— అన్నావు.

ఇక స్టేషన్లో నీ కంటినుంచి ఏకధారగా కారే కన్నీటినీ, బావ కంటిపై పొరలుగా నిర్చిడిన దుఃఖాన్నీ చూస్తూంటే నవ్వు వచ్చింది నాకు.

ఇల్లు జేరేమయా— అమ్మా నాన్నల సమక్షంలోనైనా మరవగలనేమో అనుకుంటే, ఊ హూ! 'ఈ టైముకు మీ బావ నిద్ర లేస్తారు—ఈపాటికి ఆఫీసు హడావిడిలో ఉంటారు—పాపం! హోటల్లో మెతుకులు ఈ వేళ కలిశాయో లేదో.'

అన్నీ వింటూన్న నేను—'ఈపాటికి నిద్ర పోతారంటారు' అని నువ్వన్న మాటని నిసికే నిమురుతూ, 'నీ పెద్దన కవి కాబట్టే కవితా వస్తువులుమాత్రమే చెప్పాడు కానీ క్రొత్త దంపతులకి విడి విడిగా నిద్రపట్టడానికి వలయు వాటిని చెప్పలేదు. అసలింతకీ, నీవిక్కడే ఉంటే బావకి పాపం—నిద్ర ఎలా పడుతుంది?' అని నేనంటూంటే, 'అమ్మా—చూడవే మంజుల—' అటుగా వచ్చే అమ్మని చూసి ఇటునుంచి పారిపోయాను. పాపం నీ ఫిర్యాదుకు అమ్మ కూడా నవ్వేసిందిగా ఆ తర్వాత.

ఇక ఆవేళ సాయంకాలం పని చేసేవాడు అరుగుమీద గుమ్మరిపోసిన మల్లెపూవులని నేను గజం పొడుగు దండకట్టి అందిస్తే 'ఇప్పుడెందుకూ రాత్రిగానీ...అయినా చేతికి అందిన్నాకే మేమిటే తల్లో పెట్టకుండా...' అంటూ నేను రెట్టించేసరికి తుర్రున ఎగిరిపోయావు.

ఇక ఆ మర్నాడు కిటికీలోంచి సూర్యుడు వెచ్చటి కిరణాలతో పొడుస్తున్నా లేవనిదానివి బావ వచ్చి నీ మొహాన్ని చేతుల్లోకి తీసుకుని 'అరుణా—' అని పిలిచేసరికి ఉలిక్కిపడి లేస్తూ సంతోషంలో మునిగిపోయావు. అప్పుడే ఆ గదిలోకి నిన్ను లేపుదామని, బావ వచ్చినట్లు నటిస్తానని మెల్లిగా వచ్చిన నాకు ఆ దృశ్యం కనిపించి, గిరుక్కున వెనుదిరుగుతూంటే, నన్ను చూసి నీవు పెట్టుకోకుండా పందిరిమంచం కర్రలమీద పడేసిన మల్లెదండ బారెడు పొడుగునా నవ్వింది.

'ఏయ్! నీ కెందుకూ ఇవన్నీ అంటున్నట్లున్నావ్—?' అవు...కాస్సేపు ఆలోచించుకుంటూంటే ఈ మధురస్మృతులు మదిలో మెదిలే సరికి నవ్వుకుంటావు. ఆ సమయంలో అటుగా వచ్చిన పిల్లిలా వచ్చిన బావ కారణమడిగి, నీ దరహాసితాధరాలపై చిటిక వేయడమూ జరగవచ్చు.

'మీకుమాత్రం ఎందుకు ఉండవూ? మీ బాస్ గుడ్ అని మీ ఫైళ్ళమీద వ్రాసినదీ, మీ కొలీగ్స్ సిన్సియరు వర్కరు అనుకునేదీ గుర్తుకు వస్తే నీ పెదవులమీదా చిరునవ్వు మెదులుతుంది! మా మరిది నీ పెదవులమీద కాకపోయినా చెక్కిలిమీదైనా చిటిక వేయడమూ జరగవచ్చు!' అంటావు—

అది అసంభవమైనటువంటిది. 'ఎందుకూ?' అని నీవు ప్రశ్నించకుండానే చెప్తాలే. నీవడగడానికి ఓ నాలుగు రోజులూ, దానికి నేను జవాబుకు మరో నాలుగు రోజులూ మొత్తంమీద ఎనిమిది రోజులకిపైగా నిన్ను నిరీక్షణలో పెట్టకుండా, జవాబుకూడా ఇందులోనే వ్రాస్తున్నా.

ఫైలుమీద మా బాస్ 'గుడ్' అని వ్రాయాలంటే బోలెడు తతంగం జరగాలి. ఒక వేళ వ్రాసేదా, ఆ తతంగం తరువాత జరిగి తీరుతుంది. అసలు నిన్ను నీవు చంపుకోవాలి. మొట్టమొదటగా నీ నవ్వును — కనీసం చిరునవ్వునైనా అమ్ముకోవాలి. నవ్వును బట్టి వెలకాకుండా కాలాన్నిబట్టి మనుష్యుల్నిబట్టి కూడా ఉంటూంటుందిలే? సిటీ బస్సులో వచ్చే మా విశాలాక్షి ఆరు పైసల టిక్కెట్టు ఇవ్వవలసిన అవసరం లేకుండా కండక్టరును చూసి ఓ నవ్వు నవ్వుతుంది. ఆ సమయంలో దాని విలువ ఆరు పైసలు. ఆ సమయంలో కాక ఏ సమయంలో నవ్వినా కండక్టరును చూసి నవ్వితే అర్ధ రూపాయ దాటదు ఆ నవ్వు విలువ. 'గుడ్' అని గానీ, 'శాటిస్ఫాక్టరీ' అని గానీ ఫైళ్ళమీద ఉండాలంటే అందుకనే అమ్మాలి నవ్వును.

కొంత కొంత మంది దగ్గర ఏదీ అమ్ముకో నవసరం లేకుండానే పనులు చక్కగా జరిగిపోతాయనుకో. అప్పుడు ముందు రెండు కళ్ళు ప్రశ్నిస్తాయి మరో రెండు కళ్ళని. ఆ నాలుగు కళ్ళూ కలిసి నలుగురి కళ్ళకేసి అనుమానంగా చూస్తాయి. ఆ నలుగురినీ నవ్వడమే కాకుండా మరో నాలుగు జతలని నవ్వమని సైగ జేస్తాయి. 'ఈ భాష నాకర్థంకాదు...సరిగ్గా చెప్పూ?' అని నీవు అంటున్నట్లున్నావ్.

మొదటి రెండు కళ్ళూ ప్రశ్నిస్తున్నది 'ఏమిటి విశేషం?' అని. నాలుగు కళ్ళూ కలిసి నలుగురినీ అనుమానంగా చూస్తున్నది—

# సంక్రాంతి లక్ష్మి

**ఇ. రాధ**

అదిగో సంక్రాంతి లక్ష్మి
అదిగదిగో వస్తున్నది!
మబ్బుతెరల చీరగట్టి,
మహియంతట విహరించుచు.
మిరపపండు బొట్టుపెట్టి,
మురిపెముగా కొప్పుపెట్టి,
బంతి, చేమంతిపూలు
పొందికగా తలను ముడిచి,
పంటచేల స్వాగతమ్ము
ప్రేమతోడ గైకొనుచును
సంపదలకు శరధివోలె
హేమంతపు వీధిలోన.
వయ్యారపు నడకలతో
వస్తున్నది! వస్తున్నది!
అదిగో సంక్రాంతి లక్ష్మి
అదిగదిగో వస్తున్నది!

'గిరాకీ కుదిరి, బోణీ అయిపోయినట్లుందే?' అని. చివరగా అన్నీ నవ్వేది 'అదా సంగతి!' అంటూ.

ఇదీ సంగతి...

ఇది కాక ఇంకా చాలా సంగతులు నేసి, ఇంకా గమ్మత్తుగా పాడుతూంటారులే....

'పాపం...కొత్తపిట్ట కదురా... ముడుపులు చెల్లించడానికి భయపడినట్లుంది. ప్చ్! చెల్లించే వరకూ ఆగేందుకు వెంకటేశ్వరస్వామి కాదీయన అని తెలియదు కాబోలు!' అని ఒకే వాద్యంతో మొదలెట్టి, ఆర్కెస్ట్రా అంతా ఒకేసారి వాయించి సంగతులు వేసేస్తారు.

ఈ విషయం మదిలో మెదిలిందా కొంపతీసి ఉగాది పచ్చడిలో తీపి చెరుకుముక్కలూ, పుల్లని మామిడికాయముక్కలూ నములుతుంటే పంటి క్రింద వేపపువ్వు పడినట్టుంటుంది. అప్పుడది మధుర స్మృతులలోనికి ఎక్కరాదు. క్రొత్త బట్ట రెపరెపల గంజివాసనల మధ్య విదిలించిన మాసిపోయిన బట్టకున్న మురికివాసనలాంటిది. మాసిపోయిన బట్టలను అందుకనే బయట




## పేదవాని పాట్లు!

జాతీయ రక్షణనిధికి విరాళమివ్వమని కోరితే పేదవాణ్ణి; ఏమీ చేయలేనని వాపోయారు మహా ఘనత వహించిన నిజాం ప్రభువరేణ్యులు.

---

ఉండనీయం. బట్టల బుట్టలో పడేస్తాం.

చెండూ—విషాదం త్వరత్వరగా ప్రాకేస్తాయి. క్రిందికి మనిషిని ఒకేసారి లాగేస్తాయి. మంచీ సంతోషం మెల్లిమెల్లిగా ప్రాకే బాపతు. ఒక్కొక్క మెట్టే ఎక్కాలి. ఒకేసారి పోలేం. క్రిందికి దూకేటందుకు లోతులు దొరకవు. ఎగిరితే అందనూ అందవు! కొంత ఎత్తును చేరుకున్నాకే అందుతాయి. అందుకే మంచి అవాలంటే కొన్ని ఏళ్లు పడుతుంది. సంతోషం నిచ్చెనకి ఎన్నో కర్రలమెట్లు ఎక్కాలి. కాబట్టి ఈ విషయాలు మదిలో మెదలనీయను.

'నాకేం ఫర్వాలేదు...ఆఫీసులో ఎన్ని జరిగినా ఇంటిదగ్గర అన్నీ మరిచిపోగల మీ బావ ఉన్నారు. ఇప్పటికైనా ఉద్యోగం చెయ్యాలని ఉంది' అంటూ వ్రాశావు ఆ మధ్య.

కానీ, అక్కా, బావని అనుమానిస్తున్నాననుకోకూ. పనిలో పని మా సుశీలనుగూర్చి చెప్పనా నీకు? సుశీల అంటే కలవారింట్లో అడుగు క్రిందపెట్టకుండా పెరిగి బోల్డు వేలుపోసి మొగుడిని కొనుక్కుని హాట్ పని చేస్తాం

## స్వయంవరం

దన్నానూ? ఆమె సంగతి—ఊ?

ఎక్కడికీ పోని నేను ఒక రోజున ఆమె పిసిగించి వాళ్లింటికి రమ్మంటే వెళ్లాను. ముందు పూలతోటా — అదీ — బావుంది మేడ. అందులో ఒక భాగంలో ఉంటున్నారు. గుమ్మం ఎక్కుదామనుకుంటూండగా కాలిలో ముల్లు గ్రుచ్చుకుని ఆగిపోయిన నాకు — 'ఏం? ఇంత ఆలీశం? సూపర్నెంటు నొక్కడినే ఏం ఖర్మ... మీ ఆఫీసరుని కూడా తృప్తిపరిచి రాలేకపొయ్యావ్' అనే వెగటు గొంతుక వింటూంటే అర్థమయ్యింది—పాపం అంతవరకూ సుశీల నన్నే ముందుగా ఎందుకు గుమ్మం ఎక్కమని తొందర జేసిందో! నిర్ఘాంతపడిపోయి నిటారుగా నిలబడిన నేను కాలిలో ముల్లు కసక్‌మని గ్రుచ్చుకునే సరికి 'అమ్మా!' అనుకున్నాను చిన్నగా.

సిగ్గుతో చచ్చిపోయింది ఆమె. 'పోనిద్దురూ... ఆ మాటలు సంభాషణ మాత్రం మార్చు

కోలేక పోతున్నారు. రావే, మంజులా...' అంది చివరికి!!

ఒకరోజు కాలిలో ముల్లు గ్రుచ్చుకుంటే రెండు రోజులు బాధపడ్డాను. ఆ తర్వాత మరిచిపొయ్యాను. మనసులో రోజూ ముళ్లు గుచ్చుకుంటుంటే పాపం... ఆమె ఎల్లా ఉంటుందో? అనిపించింది నాకు....

ఆ తర్వాత తెలిసింది అతను వట్టి జూదరి అనీ, చదువుకు సాక్ష్యం ఎనిమిదో తరగతి ప్యాసైనట్లు వాళ్ల వూరి బడిపంతులిని బెదరకొడితే ఇచ్చిన కాగితం తప్ప మరోటిలేదనీ, అతని అవలక్షణాల ఖర్చుకు అతని ఆస్తిలోంచి పెద్దలు అందనివ్వరనీ, ఆ ఖర్చు ఈవిడిని సంపాదించి ఈ జీతం వాడుకుంటాడనీ, ఆమె అతని ఆస్తిని— కొన్ని లక్షలు చేసే ఆస్తిని అతని నెత్తిమీద పెట్టి అమ్మితే కొన్ని వేలకి కొనుక్కుందనీ తెలిసింది.

'ఇల్లాంటివి చెప్పడంలో నీ ఉద్దేశ్యం నాకర్థం గాదు' అని విసుక్కోకు. హాయిగా ఉన్నవాళ్ళు లేరనా? అబ్బో! మా ఆఫీసుకు రెండవ సందులో మరో ఆఫీసులో మా కాంతి పనిజేస్తూంది.

కాంతి అంటే ఎవరో ఇప్పుడే నీకు పరిచయం చేయాలనుకుంటా. ఏవీ అక్కరలేకుండా, నేటి నేపథ్య సంగీతానికి అలవాటు పడిపోయిన నీకు ఆర్కెస్ట్రా ఏమీలేకుండా చెప్పేస్తా విను.

నేనో రోజున చాలా 'సీరియస్'గా పనిజేసుకుంటుంటే నా దగ్గరకు వచ్చింది... తలెత్తి ప్యూన్‌ను పిలిచి, వేరే కుర్చీ వేయించి పని చేసుకుంటూనే 'ఏమిటీ విశేషం?' అన్నాను. ఒక్కోసారి మధ్యాహ్నపు టిఫిను వేళల్లో మేమిద్దరం కలుసుకుంటుంటాం. అలాగే ఆవేళకూడా వచ్చిందన్నమాట.

కొంచెంసేపు ఏవో మాట్లాడి మధ్యలో 'ఏమే, మా ఇంటిది రౌడీఅయిపోతోందే ఈమధ్య' అంది. 'ఇదేం భాష?' అని నవ్వకు. ఆమెకి తెలుగు సరిగ్గా రాదు. యాసతో మాట్లాడుతుంది. ఆమె తెలుగు నాకెంతో ఇష్టం. అసలు విషయం మన భాషలో నీకు చెప్పాలంటే వాళ్ళాయనను గూర్చి అన్నమాట...

ఆశ్చర్యపోయి 'ఏం?' అన్నా కన్నార్పకుండా ఆమెనే చూస్తూ.

'చూడవే, మరి! ఈవేళ చిక్కుడుకాయలకి ఈనెలు తియ్యమంటే తియ్యలేదు.'

అదీ ఆయన రౌడీ అయ్యాడని నిరూపించే కారణం! ఆఫీసులో ఉన్నాననే విషయం మరిచిపోయి నవ్వేశానారోజు. ఇంక నీకు పూర్తిగా అర్థమై ఉంటుంది నేచెప్పనవసరం లేకుండానే... అవునా?

చాలా అన్యోన్యంగా ఉంటారు. అనుమానాలవేవి వాళ్ళమధ్యలో లేవు. విసువు అంటే వాళ్ళకి తెలియదు. ఆఫీసునుంచి ఇంటికి వెళ్తూనే స్టౌ వెలిగించి, ఆయన నోట్లో కాస్త కాఫీపోసి, తనూ తాగి, గబగబా మొహం కడుక్కుని కాస్సేపు మాట్లాడుకుని షికారు బయల్దేరుతారు.

ఇంటికి వచ్చేశాక సినిమానుంచి వచ్చేసరికి ఒక్కోసారి ఆలస్యం అయిపోతే, కాస్త ఉప్మాతిని వంటక్కరలేకుండా హాయిగా నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకుని నిశ్చింతగా నిద్రపోతారు.

పొద్దున్న లేవడం లేటు అయిందా—'కాంతీ, ఈపూట హోటల్లో తిందాంలే — శ్రమపడకు!' అంటాడు పాపం. మరి ఈ సంసారం హాయిగా లేదూ??

అసలు తప్పులురెండు పార్టీల్లోనూఉంటాయి, అక్కా! ఆఫీసుకి బయల్దేరేటప్పుడు అంత మరీ స్వయంవరానికి వెడుతున్నట్లు తయారై రావడం ఏమంత బాగుంటుంది చెప్పు? ఉంటే గొప్పతనం ఇంటిదగ్గర దాచుకోవాలంతే. ఎంత గొప్పవాళ్లైనా సామాన్యులందరి మల్లే పదిమంది మధ్యలోనూ కూర్చుని పని చేస్తున్నప్పుడు ఎందుకా గొప్పతనాన్ని పట్టుకుని ప్రాకులాడడం? మహా అందగత్తెలు కావచ్చు. ఆ అందం నాలుగు గోడల మధ్య దాచుకునేది. అంతేకానీ, అందగత్తెల పోటీకి వెడుతున్నట్లు ఆఫీసుకు వెళ్లడం ఏమంత బాగు చెప్పు? పదిమంది గుమాస్తాల మధ్య మసలవలసి వచ్చినపుడు, ఎందుకు ఆ అందం ప్రదర్శించడం?

అయినా నాలుగు గోడల మధ్యా జరిగిపోయేది పూర్వకాలం ఆడవారి జీవితం. ఎన్నెన్నో కట్టుదిట్టాలలో ఉండేవారు. గదిలో మగ్గిపోవాలనేది నా అభిలాష మాత్రం కాదుసుమా? మా ఆఫీసులో సరోజ ఎంత హుందాగా ఉంటుందనీ! ఆమె పళ్ళు ఎవరికైనా కనిపించాయా అనిపిస్తుంది. ఆమె పళ్ళులేని బోసిది అనుకునేవు! నాతో మాట్లాడుతూ ఒకరోజున వెయిటింగ్ రూములో నవ్వుతుంటే చూశాను. చక్కటి పలువరుస ఉంది మరి. మరోమాట! ఆమెది సింహ లగ్నమని ప్రతీతి.

కవ్వించడంలో పెట్టింది పేరు మావిశాలాక్షి.

అయినా ఇదంతా ఎందుకుగానీ ఇక ముగించేస్తా. నాకు చెయ్యి నొప్పికూడా పుడుతున్నది. ఇంత సమయం నువ్వు నాకోసం వినియోగించడం మీవారు ఒప్పుకోరు కూడా....

ముగింపు మాటలంటావా? సృష్టిలోనే లేదు పరిపూర్ణత్వం. కన్నులు మిరుమిట్లు గొలిపే అందం ప్రక్కనే—పాషాణంలాంటి హృదయం ఉంటుంది. హృదయాన్ని కరిగించివేసే పాటలోనే— అపశ్రుతి ఉంటుంది. రెట్టించే సంతోషం ఒక్కోసారి ప్రాణాలని మింగేస్తుంది. కళ్ళు మూసుకుంటే సుఖం అనుకునే అనాకారి హృదయంలోనే కాక గొంతుకలోనూ, మాటల్లోనూ అమృతం ఉంటుంది. మనస్సు నాకర్షించే పువ్వుకు సువాసన ఉండదు. ఇంకెన్నని చెప్పను?

'ముగిస్తున్నానంటూ మూడు పేజీలు మింగుతుంది మీ చెల్లాయ్' అంటున్నారు బావ. అవునా?

నా ఉద్దేశ్యంలో— ఇంటి బాధ్యతలన్నీ నిర్వహించాక పై పనులుకానీ... 'ఉద్యోగం పురుష లక్షణం, మాతృత్వం స్త్రీలక్షణం' అని చదివేమ అమధ్య 'ఓసినీ... ఇన్నాళ్ళూ వెలగబెట్టి ఇదా నీ ప్రయోజకత్వం?' అని విసుక్కోకు. మహామహులు ఒక్కోసత్యాన్ని తెలిసికోవాలని జీవితాలు వెచ్చించారు. ఇన్నాళ్ళూ నేను కాలాన్ని ఖర్చుపెట్టడంలో పెద్ద విశేషమేముంది?

మొదటగా చెప్పవలసింది చివర చెపుతున్నాను. నీ నమస్కారాల్లో బావకూడా భాగస్వామి కావాలి సుమా!

తిరుగు టపాలో జవాబు వ్రాస్తూ— నీ
మంజుల."

ఉత్తరం మడిచి తలెత్తిన అరుణకు అలారం చెప్పింది పది నిమిషాలు అయిపోయి చాలాసేపయిందని.

"ఈ మనిషేరి?" ప్రకాశంగా అనుకుంటు అరుణ సోఫావైపు చూసి.

"దేవిగారికి ఉద్యోగం చెయ్యాలని ఉన్నట్లుందే? తోచటల్లేదంటే నాకెల్లా తెలుస్తుంది? మా ఆఫీసులో నాక్రిందగా పనిజేస్తావ్?" ఆమె వెనకనే ఉన్న శర్మ ప్రశ్నించాడు—

ఉలిక్కిపడి నవ్వేసింది...

"మా చెల్లాయ్ చెప్పిందిగా— ఉద్యోగం పురుష లక్షణం, స్త్రీలక్షణం మాతృత్వమనీ? అందుకనీ.... అందుకనీ—"

"అందుకు? అందుకూ—?"

"నేనెందుకు చెప్పాలి? చెప్పనే చెప్పను..... అయినా మీ క్రింది ఉద్యోగం ఇక్కడ కావాలా? ఉద్యోగం చెయ్యాలనీ, ఒంటెత్తాటి మోత పడవాలనీ ఉన్నా, పాప వూరుకోదు తెలుసునా?" నవ్వింది అరుణ. మొహం ఎరుపెక్కిపోయింది.

"ఏమిటీ?" ఆశ్చర్యం నుంచి కోలుకోలేదు పాపం శర్మ.

"అయినా మీరు వెనకనుండి ఉత్తరం చదివేరా? అడిగితే ఇద్దునుగా? ఎందుకా దొంగ బుద్ధులూ?"

"ఓస్! ఇప్పుడు నువ్వు చెప్పిన రెండు విషయాల్లోనూ—మొదటిది నాకో పాప వస్తుందనీ, రెండోదిగా నీకు ఉద్యోగం చెయ్యాలనే అభిలాష లేదనీ. వింటూంటే మనస్సూ, హృదయమే కాక—పెట్టెలూ, బీరువాలూ, ఇల్లూ మొత్తం అంతా నిండిపోతే— ఇంకేం వరాలు కావాలి?"

నవ్వేసింది అరుణ, శర్మతోపాటు... ★

## ఎవరికివారే

**శార్వరి**

ఎవరో, ఎవరో, ఎవరో!
నా కన్నులలోనే
కాపురమున్నది!
అన్నులమిన్నై అందములోన
పందెము వేసినదెవరో!
నను బందీచేసిన దెవరు?
కలలో కనపడి కన్నులు మూసి
వన్నెలు చూపిన దెవరో!
వలపులు చిందిన దెవరు?
ఒంటరిగా నామదిలో చేరిన
కొంటె కృష్ణుడతడెవరో!
ఆ తుంటరివాడెవరు?
మల్లీ మాలతి మధురిమతో
మనసు దోచినది ఎవరో!
బాసచేసినది ఎవరు?
ఆకులలో తలిరాకులలో
జంపాలూగిన దెవరో!
పంతాలాడిన దెవరు?
వెన్నెలరేయి మింటితారగా
మెరసిపోయినది ఎవరో!
మహా మురిసిపోయినది ఎవరు? *